క్లుప్తంగా

ఒక బస్తాతో సరి..



గంటల తరబడి నిల్చొని ఒక్క యూరియా బస్తా సంపాదించుకున్న రైతు

గజపతినగరం: రైతులకు యూరియా అందించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. మండల కేంద్రంలోని శివశక్తి, మన గ్రోమోర్, తదితర దుకాణాల్లో యూరియా లేకపోవడంతో ఎక్కువ సంఖ్యలో రైతులు శనివారం స్థానిక సత్యసాయి ట్రేడర్స్ వద్దకు పరుగులు తీశారు. రైతుల తాకిడి ఎక్కువ కావడంతో వ్యవసాయాధికారి చీటీ రాసిస్తేనే యూరియా ఇస్తామని దుకాణదారులు చెప్పడంతో రైతులు మళ్లీ ఏఓ వద్దకు పరుగులు తీశారు. ఎంత భూమి ఉనా ఒక్క బస్తా ఇచ్చి సరిపెట్టుకోమంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలకు సరిపడా యూరియా తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

టోల్‌ప్లాజా ప్రారంభం



పెదమానాపురం వద్ద ప్రారంభించిన టోల్‌ప్లాజా

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాజా సిబ్బంది నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజు వసూలు చేసి, వాహనాలను త్వరితగతిన పంపిస్తామన్నారు. అలాగే వాహనదారులతో పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు.

అన్నదానం



మండల వారి కాలనీలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

గజపతినగరం/గజపతినగరం రూరల్: మండల కేంద్రం సమీపంలోని పురిటిపెంట మండలవారి కాలనీలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించగా.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, నాయకులు మండల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



దేవుడు, సర్పంచ్

బొండపల్లి: మండలంలోని కిండాం అగ్రహారం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుంగ దేవుడు శనివారం ఉదయం గుండె నొప్పితో మృతి చెందాడు. నొప్పి రాగానే కుటుంబ సభ్యులు వెంటనే గమనించి అతడ్ని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చెక్కుల పంపిణీ



బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట ఆపద్బాంధువని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఆమె స్వగృహంలో వివిధ ప్రాంతాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు 12, 93, 303 రూపాయల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మెనూలో రాజీ పడొద్దు



బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మోహన్

గజపతినగరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విషయంలో ఎటువంటి రాజీ పడొద్దని జిల్లా ఉప విద్యాశాఖాధికారి మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలను శనివారం మధ్యాహ్నం ఆయన సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి..

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకుని విద్యార్థులకు బోధించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం వాడవాడలా గురుపూజోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. అంతకుముందు రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట : ఎంఈఓ కార్యాలయంలో సన్మానగ్రహీతలతో ఎంఈఓలు కూర్మారావు, తదితరులు



గజపతినగరం రూరల్: లయన్స్ క్లబ్, చైతన్యభారతి ఆధ్వర్యంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, తదితరులు



దత్తిరాజేరు: షికారుగంజి ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడు బోగాది ఆదినారాయణను సన్మానిస్తున్న గ్రామస్తులు



వేపాడ: దబ్బిరాజుపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



కొత్తవలస : ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



పనసలపాడులో పార్టీ నాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ రఘు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కొత్తగా నియమించిన వివిధ విభాగాల పార్టీ అధ్యక్షులు, సభ్యులు కృషి చేయాలని పార్టీ బూత్ ఇన్‌చార్జ్, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశాల మేరకు మండలంలోని వెదురువాడ, పనసలపాడు గ్రామాల్లో శనివారం పర్యటించి పార్టీ అనుబంధ విభాగాల్లో నియమితులైనవారికి నియామకపత్రాలు అందజేశారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, నాయకులు ఎం.వెంకీరాజు, మోపాడ రామ్మూర్తి, మోపాడ కిషోర్, కన్నయ్య పాల్గొన్నారు.

కిక్కిరిసిన ప్రయాణం మాకొద్దు బాబోయ్..



బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న మహిళలు

గజపతినగరం: కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. దీంతో ఆర్టీసీ బస్సులకు మహిళా ప్రయాణికుల తాకిడి పెరిగింది. అయితే ప్రయాణికులకు సరిపడా బస్సులు వేయకపోవడంతో ఉన్న బస్సులు కిటకిటలాడుతున్నాయి. దీంతో కిక్కిరిసిన ప్రయాణం చేయలేమంటూ మహిళలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని వినాయక టెంపుల్ వద్దనున్న బస్టాప్‌కు పలువురు మహిళలు చేరుకున్నారు. ఎంతసేపు ఉన్నా బస్సులు రాకపోవడంతో నిరాశ చెందారు. గంటల తరబడి వేచి ఉంటే ఓ బస్సు రాగా అది పూర్తిగా ప్రయాణికులతో నిండిపోయి ఉంది. మరో అరగంట తర్వాత ఇంకో బస్సు వచ్చినా అదే పరిస్థితి. దీంతో ఆ మహిళలంతా ఆటోలో విజయనగరం వెళ్లిపోయారు. అదనపు బస్సులు వేయనప్పుడు పథకం పెట్టి ఏం ప్రయోజనమని పలువురు మండిపడ్డారు.

ఉదయం 8 గంటలకు హాజరుకావాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు ఉదయం 8 గంటలకే పాఠశాలకు హాజరై పరిసరాలను, తరగతి గదులను శుభ్రం చేయాలని ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరనరావు సూచించారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఆయాలు, ఎండీఎం నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. టాయిలెట్స్‌ను రోజుకు నాలుగు సార్లు శుభ్రం చేయాలన్నారు. వంటపాత్రలు శుభ్రం చేసిన తర్వాతే వంట ప్రారంభించాలని సూచించారు. కిచెన్ గార్డెన్‌లో పండిన కూరగాయలను వంటలో వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయాలు, ఎండీఎం నిర్వాహకులు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు

అవగాహన తప్పనిసరి

శృంగవరపుకోట: బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై కచ్చితంగా అవగాహన కల్పించాలని స్థానిక మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని.. వారిని ఎదుటి వ్యక్తులు ఏ ఉద్దేశంతో చూస్తున్నారో.. ఎలా టచ్ చేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు అనంతరం ఆమె ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థినులతో తరచూ ఉపాధ్యాయినులు మాట్లాడుతూ వారికి అవగాహన పెంచి, వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. వారి మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్న, న్యాయవాది అల్లు సత్యాజీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

సెల్‌ఫోన్లకు దూరం

- కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈఓ త్రినాథ్‌రెడ్డి

కొత్తవలస: ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈఓ త్రినాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలుగు టైటాన్స్ టీమ్ కెప్టెన్ విజయ్‌మాలిక్, జట్టు మేనేజర్ మార్విన్, ఫిజియోథెరపిస్టు అర్జున్‌తో కలిసి శనివారం సందర్శించారు. పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్న బీవీఆర్ మూర్తి గతంలో డిఫెన్స్‌లో పనిచేసే సమయంలో తెలుగు టైటాన్స్ సీఈఓ త్రినాథ్‌రెడ్డికి ఇన్‌స్ట్రక్టర్‌గా ఉండేవారు. ఈ పరిచయంతో ఆ జట్టును పాఠశాలకు రావాలని హిందీ ఉపాధ్యాయుడు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం వారిని పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్‌మాలిక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు



సంతోష్‌కుమార్ (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని గనివాడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గేదుల సంతోష్ కుమార్ (40) కనిపించడం లేదంటూ అతడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సంతోష్‌కుమార్ గత నెల 15న డ్యూటీ నిమిత్తం వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదు. అతని ఫోన్ కూడా స్విచ్చాఫ్ అయింది. తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అతడి భార్య పద్మావతి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం



వ్రతం చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: పట్టణంలోని దారగంగమ్మ ఆలయంలో ప్రధానార్చకుడు అగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు నేతృత్వంలో అనంత పద్మనాభస్వామి వ్రతం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు దంపతులు వ్రతకల్పంలో పాల్గొన్నారు. వారిచే రాజగోపాలాచార్యులు శాస్త్రోక్తంగా వ్రతం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేత్రదానంతో అంధులకు చూపు



ఏరియా ఆస్పత్రి వద్ద పోస్టర్లు విడుదల చేస్తున్న గోవిందరాజులు, సూపరింటెండెంట్

చీపురుపల్లి: నేత్రదానంతో అంధుల్లో చూపు తెప్పించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ మరణానంతరం నేత్రదానం చేయాలని చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ బి.వి.గోవిందరాజులు పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నేత్రదానంపై అవగాహన, ఫోన్ నంబర్లతో కూడిన పోస్టర్లను చీపురుపల్లిలో శనివారం ఆవిష్కరించారు. ఎవరైనా మరణించినప్పుడు నేత్రదానానికి ముందుకు వస్తే పోస్టర్లలో ఉన్న ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సుధీర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

కొత్తవలస: మండలంలోని రామలింగాపురంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యుడు బి.సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. గ్రామ పరిసరాల్లోని ఫౌల్ట్రీల్లో ఇటీవల కోళ్లు మృతి చెందాయి. దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు సత్యారావు, వైద్య సిబ్బంది పి.గీతిక, బేగం, జ్యోతి, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మండలంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- కూటమి పాలనను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



డీటీని నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరయు, వైస్ ఎంపీపీ

జామి: మండలంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండల పరిషత్ సభ్యులు ఆరోపించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. తహసీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎన్నింటి జగదీష్‌ను ఎటువంటి కారణం లేకుండా అన్యాయంగా తొలగించారని జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, ఎంపీపీ అరుణ, వైస్ ఎంపీపీలు ఎన్నింటి విజయలక్ష్మి, గేదెల వెంకటరావు, తదితరులు మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతోనే తొలగించారని, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారారని ఆరోపించారు. మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని ఎరువులు సకాలంలో అందేవని.. నేటి కూటమి ప్రభుత్వ పాలనలో ఖరీఫ్ సీజన్ ముగిసినా యూరియా అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందని.. మద్యం ఏరులై పారుతోందని..కొత్త కార్డుల పంపిణీ విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని..గొడికొమ్ము గ్రామంలో రాజకీయ కక్షతోనే పశువుల షెడ్లు తొలగించారని సభ్యులు అప్పాన సుబ్రహ్మణ్యం, గేదెల వెంకటరావు పిల్లల భవానీ, తదితరులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాలరాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నత్తే నయం

- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయిన సమావేశ భవన నిర్మాణం



పనులు నిలిచిపోయిన మెరకముడిదాం ఎంపీడీఓ సమావేశ భవనం

మెరకముడిదాం: మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న సమావేశ భవనం నిర్మాణం కొద్ది రోజులుగా నిలిచిపోయింది. భవనం కోసం ప్రభుత్వం ఉపాహామీ పథకం నుంచి రూ.80 లక్షలు కేటాయించింది. పిల్లర్లు, శ్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలు మేర బిల్లులు పెండింగ్ పెట్టడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. 2024 డిసెంబర్‌లో ప్రారంభించిన భవన నిర్మాణం ఇప్పటివరకు 50 శాతం కూడా పూర్తికాకపోవడం, ఇప్పుడు పనులు నిలిచిపోవడంతో సమావేశాలకు వసతి సదుపాయం ఇప్పట్లో కలిగే అవకాశం లేదని మండల వాసులు వాపోతున్నారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని పీఆర్ ఏఈ హరికృష్ణ వద్ద ప్రస్తావించగా బిల్లులు పెండింగ్ వల్ల పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనని, నిధులు విడుదలైన వెంటనే పనులు తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

శివరాం రోడ్డులో ప్రయాణ యాతన



శివరాం రోడ్డులో ఏర్పడిన గుంతలు

చీపురుపల్లి: పట్టణంలోని శివరాం రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయంటూ వాహనచోదకులు గగ్గోలుపెడుతున్నారు. చీపురుపల్లి పట్టణం నుంచి శివరాం, విజయరాంపురం, రెడ్డిపేట, అర్తమూరు, కోనూరు, బొప్పడాం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ఆధారం. ఫార్మా పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు కూడా ఇదే రహదారిలో వెళ్లి వస్తుంటారు. వర్షాలు కురిసే సమయంలో గోతుల్లో నీరుచేరడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కోటకు కొత్తరూపు

- జోరుగా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: 'కోట'కు ఎట్టకేలకు కొత్త రూపు రాబోతోంది. పట్టణంలోని ప్రధాన రహదారికి పట్టిన ఆక్రమణల గ్రహణం వీడనుంది. అరుకు – విశాఖ ప్రధాన రహదారిపై ఎస్.కోటలో ఆక్రమణలు పెరిగిపోవడంతో రోడ్డు తన వాస్తవ రూపు కోల్పోయింది. ఆక్రమణలు తొలగించాలని ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్నా.. మీడియాలో కథనాలు వస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు తహసీల్దార్ శ్రీనివాసరావు చొరవ తీసుకుని ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఇప్పటికే ఒకవైపు ఆక్రమణలు తీయించగా, శనివారం తెల్లవారుజామున మరోవైపు జేసీబీతో ఆక్రమణలు తొలగింపు పనులు చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ ఉద్యోగుల ఆధ్వర్యంలో తొలగింపు పనులుజరిగాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• నివాళులు..



మృతునికి నివాళులర్పిస్తున్న నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసిత రైతు వన్నెపురి పొట్టిదొర మృతికి సంతాపంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ.. నాడు తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుందని నమ్మి జిందాల్ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం మోసం చేయడంతో సుమారు 200మంది వరకు రైతులు చనిపోయారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు, అధికారులు స్పందించక పోవడంపై మండిపడ్డారు. జిందాల్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.